వృద్ధాప్యం రెండో బాల్యం

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

ఉత్తమ సేవలు అందించిన వృద్ధులతో కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 1 : వృద్ధాప్యం రెండో బాల్యమని, వారి ఆరోగ్య సంరక్షణ, సంక్షేమంతోపాటు ఆదరించడం కుటుంబ సభ్యుల బాధ్యతని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యం రెండో బాల్యంలాంటిందన్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సంరక్షణకు ఆర్‌డీవో ట్రిబ్యునల్‌ను సంప్రదించాలన్నారు. అక్కడ న్యాయం లభించకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు మాట్లాడారు. ఏ సమస్య ఎదురైనా డయల్ 100కు ఫోన్ చేస్తే పోలీసుశాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పది మంది వృద్ధులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో పద్మ, ఐసీడీఎస్ పీడీ జరీనా, సీనియర్ సిటిజన్ ఫోరం, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా వివరాలు సేకరించాలి..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు వివరాలు పక్కాగా సేకరించాలని రెవెన్యూశాఖ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్ విజయేందిర, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గాల్లోని మున్సిపల్ పట్టణం, గ్రామంలో కుటుంబ వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని ఆదేశించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడకగదులు, ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలపై సమీక్షించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 1 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రెవెన్యూ, ఆర్టీవో, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో పనిచేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్ గౌతమ్‌తో కలిసి రోడ్డు సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ సమావేశానికి జిల్లా అధికారులు హాజరు కావాలన్నారు. నారాయణపేట నుంచి మక్తల్‌కు వెళ్లే రోడ్డు దారుణంగా ఉందని, ఆ రోడ్డు మీదుగా అంబులెన్స్ వాహనాలను తీసుకురావద్దని, ప్రత్యామ్నాయ రోడ్డును ఎంపిక చేసి నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఈ ఈ దేశ్యానాయక్‌ను ఆదేశించారు. ఆ రోడ్డు మార్గంలో కాల్వలు ఉండడంతో వర్షాల వల్ల గుంతలు ఏర్పడ్డాయని, ఫ్లడ్ డ్యామేజీ రిపేర్ కింద రూ.14కోట్లతో 26కిలో మీటర్ల మేర ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ కృష్ణ కూడలి వద్ద వేగంగా వాహనాలు వెళ్తున్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మక్తల్, కోస్గి, మరికల్ పట్టణాల్లో వన్‌వే రోడ్ల గురించి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్టీవో మేఘాగాంధీ, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ సునీత, సీఐలు శివశంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మక్తల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, అక్టోబర్ 1 : అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచే ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో కీలక మైనదని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఇటీవల ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఎంతో పవిత్ర మైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అనిత గౌడ్, జీహెచ్ఎం గురు రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డికి నివాళి..

ఊట్కూర్, అక్టోబర్ 1 : మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్ రెడ్డి, అరవింద్ కుమార్, లక్ష్మీరెడ్డి, మాజీ ఎంపీపీలు చంద్రకాంత్‌గౌడ్, మణెమ్మ, ఎంపీడీవో ధనుంజయగౌడ్, లయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తులకు పూర్వవైభవం

దమగ్నాపూర్ చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: (చిన్న చింతకుంట), అక్టోబర్ 1 : కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ చెరువులో స్థానిక నాయకులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. వందశాతం రాయితీపై చేపపిల్లలను ప్రభుత్వం ఇస్తుందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి..

దేవరకద్ర, అక్టోబర్ 1 : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఎం, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వివిధ రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.

తైబజార్ రద్దుపై హర్షం..

భూత్పూర్, అక్టోబర్ 1 : పట్టణంలో చిరు వ్యాపారుల నుంచి వసూలు చేసే తైబజార్‌ను రద్దు చేయడంపై నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వ్యాపారులకు ఇచ్చిన మాట ప్రకారం తైబజార్ వసూలును రద్దు చేసినట్లు తెలిపారు.

నారాయణపేట టౌన్ : బతుకమ్మతో వస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్‌లో బతుకమ్మను ఎత్తుకున్న ట్రైనీ కలెక్టర్ గరిమనరుల

మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కళాశాలలో..

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.. బతుకమ్మ

మహబూబ్‌నగర్‌లోని మాడ్రన్ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

జడ్చర్ల మండలం కోడ్గల్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని పలువురు వక్తలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలతో పాటు మాడ్రన్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

దేశంలోనే అరుదైన పండుగ..

నారాయణపేట టౌన్, అక్టోబర్ 1 : బతుకమ్మ పండుగతో తెలంగాణ సంప్రదాయం ప్రపంచానికి చాటి చెప్పడం జరిగిందని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దేశంలోనే అరుదైన పూల పండుగ అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆడిపాడారు. అలాగే వివిధ పాఠశాలలు కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెర్సీ వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, కౌన్సిలర్ రాజేశ్వరి, వరలక్ష్మి, సలీం తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మతో చిన్నారులు, టీచర్లు

నారాయణపేట మండలంలో..

నారాయణపేట రూరల్, అక్టోబర్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, అక్టోబర్ 1 : మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. మండలంలోని డోకూర్ సమీపంలోని తపోవన్ హైస్కూల్‌లో బొడ్డెమ్మ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, అక్టోబర్ 1 : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. న్యూ ఎరా, సాహితీ, వివేకానంద, ఠాగూరు పాఠశాలల్లో వేడుకలను చేపట్టారు.

మాగనూరు, కృష్ణ మండలాల్లో..

మాగనూరు, అక్టోబర్ 1 : మాగనూరు, కృష్ణ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

దామరగిద్ద మండలంలో..

దామరగిద్ద, అక్టోబర్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు విశ్వనాథ్, సంధ్యాకుమారి, లక్ష్మీబాయి, అనిత, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

మరికల్ మండలంలో..

మరికల్/ధన్వాడ, అక్టోబర్ 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ గరిమ నరుల పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో ఆలరించారు. అలాగే ధన్వాడ మండలంలోని పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.

అడ్డాకుల మండలంలో..

మూసాపేట, అక్టోబర్ 1 : అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడ్గల్ పాఠశాలలో..

జడ్చర్ల, సెప్టెంబర్ 1 : మండలంలోని కోడ్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బొడ్డెమ్మలు ఆడారు.

భూత్పూర్ వివేకానంద విద్యాలయంలో..

మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో..

తిమ్మాయిపల్లిలో వేడుకలు నిర్వహిస్తున్న చిన్నారులు, టీచర్లు

అక్రమాలు చేస్తే సహించేది లేదు

జడ్చర్ల, అక్టోబర్ 1 : ఉదండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలు, బోగస్ వ్యక్తులను గుర్తించడానికి అవసరమైతే ఇంటింటికీ తిరిగి వివరాలు తెలుసుకుంటానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదండాపూర్ ముంపు ప్రాంతాల్లో భూములకు, గ్రామాల్లో కుటుంబాలకు పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయన్నారు. అదేవిధంగా ఆర్‌అండ్‌ఆర్ కింద వచ్చే పరిహారాన్ని కూడా సంబంధం లేని వ్యక్తుల పేర్లతో బోగస్ కుటుంబాలను జాబితాలో చేర్చారని తన దృష్టికి వచ్చిందని, వీటన్నింటిపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. పోలేపల్లి పంచాయతీలో జరిగిన అక్రమాల గురించి అధికారులకు ఫిర్యాదు చేయడం తోనే అవినీతి విషయం బయటపడిందన్నారు. అక్రమాలపై బాధితులు జడ్చర్లలోని క్యాంప్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ గుండాల దాడులు సరికాదు

ధన్వాడ, అక్టోబర్ 1 : హైదరాబాద్‌లో మూసీ నది పరివాహక ప్రాంతంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ వాహనంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసులు, నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బడాబాబుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ పేదల ఇండ్లను కూల్చడానికి ప్రభుత్వానికి ఎవరు హక్కు ఇచ్చారని ప్రశ్నించారు. పేదల స్థితిని తెలుసుకునేందుకు వెళ్లిన వారిపై దాడులు చేయించడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సునీల్‌రెడ్డి, వెంకట్రాములు, బాలరాజు, భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సేవలను క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని పాలమూరు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శేకుంటి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ మల్లురవికి పీయూ ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ఎన్ అర్జున్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, మధు, సోమేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

మరికల్, అక్టోబర్ 1 : దేశంలో విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండడం సిగ్గుచేటని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖను నిర్వహించడానికి ఎమ్మెల్యేలు ఎవరూ అర్హులు కారా అని ప్రశ్నించారు. ఎన్నో సమస్యలు తాండవిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. గురుకులాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఎన్నో పాఠశాలల్లో నిత్యం సమస్యలతో విద్యార్థులకు సతమతమవుతున్నారని తెలిపారు.

ఎంవీఎస్‌ను అత్యున్నత స్థానంలో నిలుపుతాం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మావతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలను రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అలూమ్నీ సహకారంతో ముందుకు సాగుతామని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని యూజీ, పీజీ, సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మొత్తం 250 మంది మహిళలు, విద్యార్థినుల సౌకర్యార్థం పీఎం ఉషా పథకం కింద కేంద్రం కేటాయించిన నిధులు రూ.5కోట్లతో మహిళా వసతి గృహం జీప్లస్-2 నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో టాప్-10 కళాశాలల్లో ఎంవీఎస్ ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కళాశాలకు మాస్టర్ ప్లాన్ అప్రూవల్ కావడం ఎంతో సంతోషించదగ్గ పరిణామమన్నారు. మాస్టర్ ప్లాన్‌తో 100 అదనపు తరగతి గదులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, ఇలా అనేకమైన సౌకర్యాలు సమకూలే అవకాశాలు ఉన్నాయన్నారు. 1965లో కళాశాల ఏర్పడిందని, 60 వసంతోత్సవాలను అలూమ్నీ సహకారంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, దాతలు ఎంవీఎస్ కళాశాల అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంవీఎస్ పరీక్షల నిర్వహణ అధికారి సురేశ్, తెలుగు విభాగాధిపతి కృష్ణమూర్తి, జువాలజీ రవీందర్‌రావు, అటానమస్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్, కళాశాల పౌర సంబంధాలశాఖ అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారంగా కాకుండా బాధ్యతగా చూసుకోవాలి

సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఎంపీడీవో విజయకుమార్

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), అక్టోబర్ 1 : వృద్ధులను భారంగా కాకుండా బాధ్యతగా చూసుకోవాలని ఎస్సై శేఖర్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్న చింతకుంట మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోషే, సోషల్ వర్కర్ శేఖర్, ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

జడ్చర్ల, అక్టోబర్ 1 : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలోని 3వ వార్డులో గల మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

23న ఎంవీఎస్‌లో అంతర్జాతీయ సదస్సు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న 'డాక్టర్ కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సదస్సు సంచాలకులు, తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, సురేశ్, రవీందర్, సత్యనారాయణగౌడ్, సాంబశివరాలు, తెలుగు విభాగం అధ్యాపకులు రాఘవేంద్రరావు, సుభాషిణి, స్వరూప, స్వప్న, భువకర్, గోవర్ధన్, మారెప్ప, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

నారాయణపేట, అక్టోబర్ 1 : శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 30వ తేదీ వరకు నెల రోజులపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న కారణంగా జిల్లాలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండేలా సమావేశాలు నిర్వహించొద్దన్నారు. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో అనవసర విషయాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం

విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఊట్కూర్, అక్టోబర్ 1 : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వెంకటేశ్ ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. మంగళవారం హెచ్ఎం కుసుమ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు వెంకటేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

జడ్చర్ల, సెప్టెంబర్ 1 : మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జడ్చర్లలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గంగాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నరేందర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. హెల్త్ క్యాంప్‌ను జెడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ మండల కమిటీ ఎన్నిక

దేవరకద్ర, అక్టోబర్ 1 : వీర శైవ లింగాయత్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మంగళవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా రాకేశ్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీశైలం, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్‌తోపాటు సభ్యులను ఎనుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గూరకొండలో పక్షవాతంతో అనారోగ్యానికి గురైన సుజాతకు సంఘం నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరికల్, అక్టోబర్ 1 : విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, 25 సమస్యలపై సీఎంకు నివేదిక పంపట్లు ఎలక్ట్రిసిటీ యూనియన్ 1104 రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫోర్‌మెన్ శ్రీనివాసులు పదవీ విరమణలో ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.